సహకారం అందిస్తాను. కాని నే ననుకున్నట్లు వాళ్ళ జీవితాలు రూపురేఖలు దిద్దుకోకపోతే క్రుంగిపోను. సరిపెట్టుకుంటాను. అది సహజమైన విషయంగా భావించి ఊరుకుంటాను.''

''పిల్లల కోసం తల్లీ, తండ్రీ మథనపడటం తప్పంటావా?''

''తప్పు కాదు. మథనం చాదస్తం కాకూడదు. దానిని తేలికగా తీసుకోకపోతే ఇవ్వకూడనంత ప్రాధాన్యం ఇస్తే మనం మెంటల్ పేషెంట్స్‌గా తయారవవలసి వస్తుంది.''

రాజాచంద్ర ఏమీ మాట్లాడలేక కొంచెంసేపు స్తబ్దుగా ఉండిపోయాడు.

జగదీష్ అతని ఖాళీ గ్లాసులో కొంచెం విస్కీ పోశాడు.

రాజాచంద్ర ఉలిక్కిపడి ''అరె ! ఇదేమిటి ఇప్పటికే కొంచెం ఎక్కువ తీసుకున్నాను'' అన్నాడు కంగారుపడుతూ.

''ను వ్వెక్కువేం తీసుకోలేదు. నువ్వు డ్రింక్ చేసినవన్నీ హాఫ్ పెగ్సే. అప్పుడప్పుడూ లైఫ్‌కి కొంత థ్రిల్, మన సొంత జీవిత మంటూ ఉండాలి చంద్రా.''

ఎందుకో ఆ రోజు ఇంకా కొంచెం తాగా లనిపించింది. జగదీష్ సోడా కలిపాక గ్లాస్ చేతిలోకి తీసుకున్నాడు.

** ** **

దాదాపు ఓ గంట గడిచాక రాజాచంద్ర కారు డ్రైవ్ చేస్తూ ఇంటివైపు పోనిస్తున్నాడు.

జగదీష్ మాటలు మెదడులో ప్రతిధ్వనిస్తున్నాయి.

ఎన్ని రకాల మనస్తత్వాలు ! భార్యా భర్త ఒకరికోసం ఒకరు అనుక్షణం తాపత్రయపడుతూ, పిల్లలను స్నేహితులుగా చూసుకుంటూ, వాళ్ళ వ్యక్తిత్వాలకి గౌరవమిస్తూ, వాళ్ళ గురించి ఆరాటపడుతూ-తమ కుటుంబం; శాసనంతో, కను సన్నలతో కఠిననియమాలతో కనుసన్నల ఆజ్ఞల పరిపాలనలో తప్ప సంసారం సరిగ్గా సాగదని భావించే అర్ధనారీశ్వరరావు కుటుంబం, ఏం జరిగినా తేలికగా, నిర్లక్ష్యంగా తీసుకుంటూ ఏ కాంప్లికేషన్ కయినా సిద్ధపడే జగదీష్ కుటుంబం...

ఎక్కడో లోపముంది. తెలీటంలేదు. అన లీ జనరేషన్‌లోనేనా? పరిస్థితుల్ని అవగాహన చేసుకుని మనుషులని మనవైపు తిప్పుకో లేకపోవటంవల్లనా?

అతనికి నిజంగా తెలీటంలేదు.

** ** **

కారు పోర్టికోలో పెట్టి దగ్గరగా వేసి ఉన్న డోర్ తెరుచుకుని లోపలకు వెళ్ళాడు. విశారద సోఫాలో కూర్చుని టీ.వీ. వైపు చూస్తోంది. టీ.వీ. స్క్రీన్‌మీద ఏవో బొమ్మలు కదులుతున్నాయి. అతనివైపు తలతిప్పి చూసి నవ్వింది.

ఓ పది నిమిషాలు గడిచాక అతను డ్రెస్ ఛేంజ్ చేసుకుని బెడ్‌మీద ఉన్నాడు. విశారద లోపలికి వచ్చి తలుపులు మూసింది.

''పిల్లలంతా ఇంటికి వచ్చారా?'' అన్నాడు.

''ఊ'' అంది. నిజానికి వినూత్న ఒక్కతే ఇంట్లో ఉంది.

అత నా రోజు భోజనానికి రానని ముందే చెప్పాడు. అందుకని ఆ విషయం ప్రస్తావనకు రాలేదు.

''నేను...ఇవేళ డ్రింక్ చేశాను'' అన్నాడు. ఆ సంగతి ఆమె కెంత తొందరగా చెబుదామా అని ఆరాటపడుతున్నాడు.

విశారద నవ్వింది. బెడ్‌మీద అతని పక్కకి వచ్చి కూర్చుంది.

''నీకు... నే నంటే కోపం రావటంలేదా?''

''దేనికి?''

''డ్రింక్ చేసినందుకు...''

''మొగవాడు సొసైటీలో అనేకమందితో సంచరించాల్సి వస్తూ ఉంటుంది. అందుకని కొన్ని తప్పవు. అంతే కాక డెయిలీ రొటీన్‌తో విసుగెత్తి, అలిసిపోయి ఉన్న మనిషికి కొంత రిలీఫ్ కావాలని తెలుసు.''

అతని గుండెలోంచి బరువు తీసేసినట్లయింది. ఇప్పుడు చాలా నిశ్చింతగా ఉంది.

విశారద అతని పక్కకు జరిగి పడుకుని కళ్ళు మూసుకుంది.

''నిద్ర వస్తోందా?''

''ఊ.''

''నా కోసం కూచుని కూచుని శ్రమ, పైగా తెల్లవారుజామునే నిద్ర లేవాలి.''

''ఇందులో శ్రమేముంది? మా అందరికోసం, కుటుంబాన్ని పైకి తీసుకురావటం కోసం మీరు పడే శ్రమలో ఇది ఎన్నోవంతు?''

''నిజంగా, మనస్ఫూర్తిగా ఈ మాట అంటున్నావా?''

''నిజం. మీ ముందు నేను ఏ విషయంలోనూ అబద్ధం చెప్పను.''

జగదీష్ మాటలు చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి.

''విశారదా ! ఒక్క సంగతి అడగనా?''

ఆమె అతనివైపు పూర్తిగా తిరిగింది. బెడ్‌లైట్ వెలుతురులో ఆమె కళ్ళు మిలమిల మెరుస్తున్నాయి.

''ఏమిటది?''

''నువ్వు...''

''ఊ...''

''నీలో...''

''చెప్పండి'' ఆమె కళ్ళు నవ్వుతూ, ప్రేమగా చూస్తున్నాయి.

''నీ మనసులో...''

''ఎందుకలా తటపటాయిస్తారు? అడగండి.''

''నాకు తెలియనిది, చెప్పకూడనిది, సందర్భమేదయినా సరే, దాచి ఉంచిందేమయినా ఉందా?''

విశారద నవ్వింది. ''మీ కెందుకొచ్చిం దా అనుమానం?'' అనడగలేదు.

''నాలో, ఏ ఒక్క అణువులోనైనా...మీకు తెలియనిది, మీకు తెలీకుండా దాచి ఉంచినదీ ఏమీలేదు. అంతేకాదు. మీకు తెలీకుండా దాచుకునే శక్తి నాలో లేదు.''

సంతోషంతో, గర్వంతో అతని హృదయం ఉప్పొంగింది. ఇంకా దగ్గరగా జరిగి, చేతు లామెచుట్టూ వేశాడు.

[సశేషం]

## మినీకథ

### ఇవ్వగానే సరా?

**కోలపల్లి ఈశ్వరరావు**

ఆ రోజే ఆ ఆఫీస్‌కు ట్రాన్స్‌ఫరై వచ్చాడు కామేశు! ఆఫీసు ఒక్కసారి కలయచూసి అందరికన్నా ప్యూన్ మంచి లీడింగ్‌లో ఉన్నట్లు పసిగట్టి - వాణ్ణి మంచి చేసుకోవాలని పళ్ళికిలించాడు-

ఆ ప్యూన్ కనీసం నవ్వలేదు సరికదా - ముఖం చాటు చేసుకున్నాడు.

పక్క సీట్లో వ్యక్తి కిసుక్కున నవ్వి "లంచానిగ్గాని లొంగడండీ బాబూ" అంటూ తారక మంత్రం ఉపదేశించాడు!

దగ్గరే ఇల్లు దొరకటంతో మధ్యాహ్నం లంచ్‌కి వెళ్ళినప్పుడు మూడు ప్యాంట్లు, మూడు చొక్కాలు కవర్లో పెట్టి మరీ తీసుకొచ్చి ప్యూన్ గారికి ఇచ్చాడు.

అప్పుడు ఇకిలించాడు ప్యూన్. 'హమ్మయ్య!' అనుకుని సీట్లో కూచున్నాడు కామేశు.

పక్కరోజు ప్యూన్ ముఖం చిటపట లాడుతూంది - అదీ కామేశుని చూసినప్పుడే!

ఆఫీసరుగారు తన కిమ్మన్న ఫైలును క్రికెట్ బంతి విసిరినట్లు విసిరాడు ప్యూన్ - అది నూటిగా కామేశు ముక్కును ముద్దాడింది. అదిరిపోయాడు కామేశు! తన భార్య అప్పడాల కర్రను కూడా ఎప్పుడూ అంత స్పీడుగా వదల్లేదేమో తన మీదకు! 'మళ్ళీ ఏమొచ్చింది వీడికి' అనుకుంటూ మెల్లగా ప్యూను పక్కన చేరి, అతని కాలర్‌ను అతి మృదువుగా సవరిస్తూ అడిగాడు కామేశు!

వినుక్కున్నాడు, చిరాకు పడ్డాడు, ధుమధుమ లాడాడు. మింగేసేలా చూశాడు. చివరికి విషయం చెప్పాడు.

"ఇంకెప్పుడూ నన్నిలా అవమానించకండి". అని కూడా అన్నాడు విషయానికి ముందస్తుగా.

ఓర్పుగా కూచున్నాడు కామేశు!

"అది కాదండీ బట్టలిచ్చారు సరే. అంత కాస్ట్‌లీవి ఇంట్లో ఉతికి వేసుకుంటే మీకు షేమ్ కదా - బట్టలు సరిగా వాడ్డంలేదని బాధపడరూ? అందుకనే వాటిని లాండ్రీకి వేయదలచుకున్నా - నెల కో యాభై రూపాయలు వాటి ఖర్చుల కింద ఇవ్వండి. మీ బట్టలు జాగ్రత్తగా తొడుక్కుని జాగ్రత్తగా లాండ్రీకి వేస్తా. బిడ్డల్ని కనగానే సరి కాదండీ! వారి బాధ్యత చూడాలి. అలాగే గుడ్డలు ఇవ్వగానే సరా?..." చెప్పుకుపోతున్నాడు ప్యూన్.

'సిగరెట్ మానేస్తే కానీ ప్యూన్‌కు యాభై ఇవ్వలేను...' మనసులో గొణుక్కుంటున్నాడు కామేశు!

---

"నా అంత వేగంగా ఎవరూ మాట్లాడలేరు" అని గర్వంతో తనను తాను పొగడుకునే వాచాలురున్నా— మీ మాటల వేగం ఒక్క నిముషానికి 125 పదాలే ఉంటాయి. అయితే మన ఆలోచనలలోని పదాలు నిముషానికి 501 ఉంటాయట.

గడ్డం పెంచిన వారు జ్ఞానవంతులా! మగవారి గడ్డాలు నెలకు సుమారు 2 సెంటీమీటర్లు పెరుగుతాయి. అంటే రోజుకు 0.07 సెంటీమీటర్లన్న మాట.

- చాగాపురం నాగేశ్వరరావు